

మహానాడు వేదికపై ఆశీనులైన మఠాధిపతులు



చెన్నై క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహానాడును ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

ఘనంగా ముత్తమిళ్ మురుగన్ మహానాడు

- ఆలయాలు సమానత్వానికి ప్రతీకగా వెలుగొందాలి
- భక్తులు, పామరులు మెచ్చిన ప్రభుత్వం మాది
- ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆధ్యాత్మిక చరిత్రలో ప్రపంచ ముత్తమిళ్ మురుగన్ మహానాడు సుస్థిర స్థానం సంపాదించుకుంటుందని, భక్తులే కాకుండా పామరజనాలు కూడా మెచ్చుకునే రీతిలో ద్రావిడ తరహా పాలనను అందిస్తున్నామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ శైవక్షేత్రం పళనిలోని పళనియాండవర్ కళాశాల మైదానంలో శనివారం ఉదయం ప్రపంచ ముత్తమిళ్ మురుగన్ మహానాడు అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ మహానాడును చెన్నై క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దేవాదాయ శాఖమంత్రి పీకే శేఖర్ బాబు గత మూడేళ్ల రాష్ట్రంలోని సుప్రసిద్ధ ఆలయాలను స్వయంగా పరిశీలించి వాటి మరమ్మతులకు, కుంభాభిషేకాల నిర్వహణకు చర్యలు చేపట్టారని ప్రశంసించారు. తమిళుల ఆరాధ్యదైవం మురుగప్పెరుమాళ్ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటిచెప్పే విధంగా రెండు రోజులపాటు జరగనున్న మహానాడును కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో తృతీయక్షేత్రంగా ఉన్న పళనిలో ప్రారంభించడం తనకెంతో ఆనందంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఆలయాల జీర్ణోద్ధరణ పనులను చూసి ఆధ్యాత్మిక ప్రముఖులు కుండ్రక్కుడి అడిగళార్, కృపానందవారియార్ స్వామి ప్రశంసల వర్షం కురిపించారని స్టాలిన్ గుర్తు చేశారు. గత మూడేళ్లుగా ద్రావిడ తరహా పాలనలో పళని, తిరుత్తణి, తిరుచెందూరు, మరుదమలై, కుమారవయలూరు, సిరువాపురి, కాందల్ అనే ఏడు సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భారీ ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని, పళని ఆలయ అభివృద్ధి పనుల కోసం 58.77 ఎకరాలను కొనుగోలుకు రూ.58.54 కోట్ల మేరకు నష్టపరిహారం చెల్లించినట్లు ఆయన చెప్పారు. మురుగన్ కొలువుదీరిన ఆరు దివ్యక్షేత్రాల్లో ప్రస్తుతం రూ.789 కోట్లతో 251 అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇక ఆలయాల్లో రోజువారీ కూలీపై పని చేసిన కార్మికులందరినీ దశలవారీగా తమ ప్రభుత్వం పర్మనెంట్ ఉద్యోగులుగా స్థాయిని పెంచిందన్నారు.



మహానాడు వేదికపై జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న మఠాధిపతులు, దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు

దైవిక చింతనలు... విశ్వాసాలు

డీఎంకే ప్రభుత్వం ఎప్పుడూ దైవిక చింతనలు కలిగిన ప్రజల నమ్మకాలు, విశ్వాసాల పట్ల గౌరవ భావాన్నే ప్రదర్శిస్తుందని స్టాలిన్ అన్నారు. గత మూడేళ్లుగా తమ ప్రభుత్వం 1355 ఆలయాలకు కుంభాభిషేకాలను నిర్వహించిందని, ఆదిద్రావిడులకు చెందిన ఆలయాల మరమ్మతులకు రూ.50 కోట్ల మేరకు నిధులు విడుదల చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 756 ఆలయాల్లో రోజంతా భక్తులకు అన్నదానం చేస్తున్నారని, రోజూ 82 వేలమందికి పైగా భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారని తెలిపారు. దేశ, విదేశాల నుంచి ఆధ్యాత్మిక వేత్తలు, మఠాధిపతులు, న్యాయమూర్తులు, తమిళ సాహిత్యకారులు, సంగీత కళాకారులు, నాట్యకళాకారులు ఈ మహానాడుకు విచ్చేయడం తనకెంతో సంతోషంగా ఉందని స్టాలిన్ పేర్కొంటూ ఆలయాలలోని గర్భాలయాలు అన్ని వర్గాల ప్రజలకు సమానత్వ పాటించే విధంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆలయాల్లో ప్రాచీన తమిళభాషకు అధిక ప్రాధాన్యం ఉండాలని, తమిళంలోనే మంత్రోచ్చాటనలు చేసే పద్ధతి ఇప్పటివలెనూ ఎల్లప్పుడూ కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాని స్టాలిన్ పేర్కొన్నారు.

అట్టహాసంగా మహానాడు ప్రారంభం...

పళని క్షేత్రంలో ప్రపంచ ముత్తమిళ్ మురుగన్ మహానాడు శనివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రారంభదినం సందర్భంగా ఉదయం 8.30 గంటలకు వివిధ మఠాధిపతులు, ఆధ్యాత్మిక ప్రవచనకర్తలు, ప్రముఖులు జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఆ తర్వాత పళనియాండవర్ కళాశాల మైదానంలో 100 అడుగుల ఎత్తైన పతాక స్తంభంపై మహానాడు లోగో ముద్రించి ఉన్న పతాకాన్ని వేలూరు సమీపం రత్నగిరికి చెందిన బాలమురుగన్ అడిమై స్వామి ఆవిష్కరించారు. ఉదయం 9 గంటలకు మహానాడు ఎగ్జిబిషన్‌ను మంత్రులు ఐ.పెరియ సామి, పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ మహానాడులో కుండ్రక్కుడి పొన్నంబల అడిగళార్, ధర్మపురి ఆధీనం దేశిక జ్ఞానసంబంధ స్వామి, మయిలం బొమ్మపుర ఆధీనం శివ జ్ఞాన బాలయ స్వామి, మదురై ఆధీనం జ్ఞాన సంబంధ దేశిక స్వామి, శ్రీలంక ఈస్ట్ ప్రావిన్స్ గవర్నర్ సెంథిల్ తొండైమాన్, లండన్ డిప్యూటీ మేయర్ పరమనందా, మలేసియా మాజీ మంత్రి సుబ్రమణ్యం, ఎంపీ సచ్చిదానందం, శాసనసభ్యుడు సెంథిల్‌కుమార్ పర్యాటక, దేవాదాయ శాఖల కార్యదర్శి డాక్టర్ పి.చంద్ర మోహన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, దిండుగల్ జిల్లా కలెక్టర్ ఎంఎన్ పూంగొడి, అదనపు కమిషనర్ డాక్టర్ ఇరా సుకుమార్ పాల్గొన్నారు.



స్వామిమలైని తలపించేలా రూపొందించిన సెట్టింగ్

తిరుచెందూరు ఆలయంలో ఆవణి ఉత్సవాలు ప్రారంభం



ధ్వజస్తంభానికి మహా దీపారాధన చేస్తున్న ప్రధాన అర్చకులు

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో ఆవణి ఉత్సవాలు శనివారం వేకువజాము అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము 1 గంటకు ఆలయాన్ని తెరచి, 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, 2 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం, 3 గంటలకు ఉదయ మార్తాండ దీపారాధన నిర్వహించారు. ఆ తర్వాత ధ్వజస్తంభ పతకాన్ని వెండి పల్లకీపై అధిష్ఠింప జేసి మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని తొమ్మిది సన్నిధుల మార్గం మీదుగా ధ్వజస్తంభ ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేకువజాము 5.15 గంటలకు ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక కంకణధారులైన హరిహర సుబ్రహ్మణ్యభట్టర్ ధ్వజారోహణం నిర్వహించారు. ఆ సందర్భంగా 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. 6.30 గంటలకు మహాదీపారాధన జరిపారు. ఈ వేడుకల్లో తిరువాడుదురై ఆధీనం శ్రీమద్ శంకరలింగ తంబిరాన్ స్వామి, తిరుచెందూరు మేజిస్ట్రేట్ సెల్వపాండి, ఆలయ ట్రస్టీలు అనితా కుమరన్, పి.గణేశన్, ఎన్.రామదాస్, డిప్యూటీ కమిషనర్ ఎస్ జ్ఞానశేఖరన్, హిందూమున్నాని రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీటీ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన రథోత్సవం సెప్టెంబర్ 2న జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ట్రస్టు బోర్డు అధ్యక్షులు ఆర్.అరుళ్‌మురుగన్, డిప్యూటీ కమిషనర్ ఎస్.జ్ఞానశేఖరన్, ట్రస్టుబోర్డు సభ్యుడు వి.సెంథిల్‌మురుగన్ చేపడుతున్నారు.

శ్రీలంక నావికాదళం అక్రమనిర్బంధం నుంచి తమిళ జాలర్లను, పడవలను విడిపించండి

- కేంద్రమంత్రి జయశంకర్‌కు సీఎం స్టాలిన్ లేఖ





చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తమ దేశ సముద్ర జలాల్లోకి అక్రమంగా చొరబడ్డారనే కుంటిసాకులు చెబుతూ శ్రీలంక నావికాదళం అరెస్టు చేసి తీసుకెళ్లిన తమిళనాడుకు చెందిన జాలర్లను, వారి పడవలను విడిపించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జయశంకర్‌కు ఆయన లేఖ రాశారు. నాగపట్టినం జిల్లాకు చెందిన 11 మంది జాలర్లు కోడియకరై ప్రాంతానికి ఆగ్నేయంగా శుక్రవారం సాయంత్రం చేపల వేట సాగిస్తుండగా శ్రీలంక నావికాదళం అక్రమంగా నిర్బంధించి కాంగేశన్ ఓడరేవుకు తరలించుకెళ్లినట్లు తెలుసుకుని ఆ జిల్లా మత్స్యకారులే కాకుండా తాను కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నానని తెలిపారు. ఇలాంటి సంఘటనల వల్ల రాష్ట్రంలోని జాలర్లు చేపల వేటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని పేర్కొన్నారు. ఈ యేడాది ఇప్పటివరకూ రాష్ట్రానికి చెందిన 324 మంది జాలర్లను అరెస్టు చేసి, 44 పడవలను శ్రీలంక నావికాదళం స్వాధీనం చేసుకుందని తెలిపారు. శ్రీలంక నావికాదళం సాగిస్తున్న దాడులు, అక్రమ నిర్బంధాల వల్ల తమిళ జాలర్ల భవిష్యత్తు అంధకారంగా మారుతోందని, ఇకనైనా కేంద్రప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని తమిళ జాలర్ల అక్రమ నిర్బంధాలను అరికట్టాలని, ఆ దిశగా కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖమంత్రి జయశంకర్ తక్షణ చర్యలు చేపట్టాలని స్టాలిన్ ఆ లేఖలో డిమాండ్ చేశారు.

ఆగని లంక నావికాదళం దాడులు

- 11 మంది జాలర్ల అరెస్టు

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లా అక్కరైపేట ప్రాంతానికి చెందిన నాగరత్నం, సంజయ్, ప్రకాష్, సుదందిర సుందర్, చంద్రు, రమేష్, ఆనందవేల్, నంబియార్‌నగర్‌కు చెందిన శివరాజ్, వరశన్, సుమన్, పుదియకల్లరైకి చెందిన రాజేంద్రన్ ... శాంతి అనే వ్యక్తికి చెందిన మరపడవలో గురువారం రాత్రి అక్కరైపేట చేపలరేవు నుంచి సముద్రంలో చేపలవేటకు బయలుదేరారు. శుక్రవారం సాయంత్రం కోడియక్కరైకి ఆగ్నేయ దిశగా సుమారు 41 నాటికల్ మైళ్ల దూరంలో వీరంతా చేపలు పడుతుండగా, గస్తీ నౌకలో వచ్చిన లంక నావికాదళం తమ దేశ సముద్రజలాల్లోకి చొరబడ్డారంటూ దాడికి దిగారు. ఆ తర్వాత 11 మంది జాలర్లను శ్రీలంకలోని కాంగేశన్ రేవు నావికాదళం శిబిరానికి తరలించారు. ఈ విషయం తెలుసుకుని నాగపట్టినం జిల్లా మత్స్యకారుల సంఘాల సమాఖ్య నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

మెరీనాలో ఓపెన్ ఎయిర్ థియేటర్లు



మెరీనాబీచ్‌లో స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలిస్తున్న మంత్రి నెహ్రూ

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత పొడవైన బీచ్‌లలో రెండో స్థానం పొందిన చెన్నై మెరీనాబీచ్‌లో సందర్శకులకు వినోదం అందించే దిశగా రెండు ఓపెన్ ఎయిర్ థియేటర్లు నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు చర్యలు ప్రారంభించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు మెరీనాబీచ్‌లో సుమారు 2 వేల తోపుడు బండ్ల దుకాణాలను క్రమబద్ధీకరించిన కార్పొరేషన్ అధికారులు వాటి సంఖ్యను 900కు తగ్గించారు. యేళ్ల తరబడి బీచ్‌లో వ్యాపారం చేసుకుంటున్న 540 మందికి, కొత్తగా 360 మందికి ఆ దుకాణాలను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో మెరీనా బీచ్ సమీపంలోని లైట్‌హౌస్ ప్రాంతం అన్ని హంగులతో సొరంగ మార్గ మెట్రోరైల్వేస్టేషన్ ఏర్పాటు కానుండటంతో ఆ ప్రాంతానికి వచ్చే సందర్శకుల సంఖ్య నాలుగింతలకు అధికమవుతుందని కార్పొరేషన్ అధికారులు భావిస్తున్నారు. మాధవరం, పూందమల్లి, షోళింగనల్లూరు నుంచి లైట్‌హౌస్ మెట్రో స్టేషన్‌కు రోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మెరీనా బీచ్‌కు మరిన్ని మెరుగులు, సందర్శకులకు సరైన వసతులు కల్పించే దిశగా నగర పాలక శాఖమంత్రి కేఎన్ నెహ్రూ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ జె.కుమార గురుబరన్ ఇతర అధికారులతో కలిసి అక్కడి స్విమ్మింగ్‌పూల్‌ను పరిశీలించారు. అదే విధంగా మెరీనా సర్వీసు రోడ్డు అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గురించి అధికారులతో ఆయన చర్చించారు. మెరీనా బీచ్‌ను అభివృద్ధి పరచే దిశగా చిన్నారులకు క్రీడా స్థలాలు, మహిళల కోసం వ్యాయామ కూడళ్లను వృద్ధుల కోసం ప్రత్యేకమైన సీట్లతో బీచ్ వ్యూ పాయింట్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయమై గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ... బీచ్‌లో సందర్శకులకు వినోదం కల్పించేందుకు రెండు ఓపెన్ ఎయిర్ థియేటర్లు నిర్మించనున్నట్లు తెలిపారు. నెలలోగా ఈ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో మెరీనాబీచ్‌ని సర్వాంగ సుందరమైన సందర్శన ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. పలు చోట్ల వాటర్ ఫౌంటైన్లు కూడా ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.



చెన్నై నగరంలోని చేపాక్ కలైవానర్ అరంగంలో శనివారం సాయంత్రం డీఎంకే సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి ఏవీ వేలు రచించిన 'కలైంజర్ ఎనుం తాయ్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించి, తొలి ప్రతిని సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు అందిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. ఈ కార్యక్రమంలో రచయిత ఏవీ వేలుతో పాటు పలువురు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ఆకస్మికంగా గవర్నర్ ఢిల్లీ పయనం

- 3 వారాల్లో ఇది మూడోసారి



చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి శనివారం ఆకస్మికంగా ఢిల్లీకి బయలుదేరివెళ్లారు. ఢిల్లీలో ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, హోం మంత్రి అమిత్‌షాతో భేటీ కానున్నారు. గవర్నర్ రవి పదవీకాలం జూలై నెలాఖరుతో ముగిసింది. పలు రాష్ట్రాల గవర్నర్లను మార్చిన కేంద్రప్రభుత్వం రవిని మాత్రమే కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన కేంద్ర హోం మంత్రితో భేటీ కానుండడంతో కీలక ప్రకటన జారీ అవుతుందని తెలుస్తోంది. గవర్నర్ రవి పదవీ కాలాన్ని పొడిగించినట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. దీంతో ఆయన గవర్నర్ పదవిలోనే గత మూడువారాలకు పైగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా ఈనెల 1న ఆయన చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్ళి, అక్కడ రాష్ట్ర గవర్నర్ల సదస్సులో పాల్గొన్నారు. 4న నగరానికి తిరిగొచ్చారు. ఈ నెల 19న ఆయన మళ్లీ ఢిల్లీకి వెళ్లారు. మూడు రోజులపాటు అక్కడే బసచేసి ఈనెల 21న చెన్నైకి తిరిగొచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెలలో మూడోసారి శనివారం ఉదయం 6.40 గంటలకు విమానంలో ఢిల్లీకి ఆకస్మికంగా బయలుదేరి వెళ్లారు. ఈసారి ఢిల్లీలో ఆయన రెండు రోజులపాటు బస చేయనున్నారు. ఈ నెల 25న విస్తారా ఎయిర్‌లైన్స్‌లో ఢిల్లీ నుంచి బయలుదేరి నగరానికి తిరిగిరానున్నారు. ఇలా గవర్నర్ అదే పనిగా ఢిల్లీకి వెళ్లడం తన పదవీ కాలం పొడిగింపు ఉత్తర్వుల కోసమేనని చెబుతున్నారు. ఈ సారి తన పదవీ కాలం పొడిగింపు ఉత్తర్వును గవర్నర్ రవి సాధించుకుని తిరిగి రావటం ఖాయమని రాజ్‌భవన్ అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇదిలా ఉండగా గవర్నర్‌గా మరొకరిని కేంద్రప్రభుత్వం నియమించే అవకాశం ఉందని, అనువైన వ్యక్తి కోసం అన్వేషణ జరుగుతోందని, అప్పటిదాకా రవిని గవర్నర్‌గా కొనసాగుతారని ఊహాగానాలు చెలరేగుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ మూడు వారాల వ్యవధిలో గవర్నర్ రవి మూడుసార్లు ఆకస్మికంగా ఢిల్లీకి వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సమాచార ధ్వని

డిసెంబరు 3న 'హెలెన్ కెల్లర్ అవార్డు'

ఐసిఎఫ్, ఆగస్టు 24: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవమైన డిసెంబరు 3న 'హెలెన్ కెల్లర్ అవార్డు' అందజేయనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి సీజే థామస్ వైద్యన్ తెలిపారు. అంధులు, బధిరులకు విద్యాబోధన చేసే ఉత్తమ ఉపాధ్యాయులకు రాష్ట్రప్రభుత్వం పురస్కారం అందజేస్తున్న విషయం తెలిసిందే. వికలాంగుల సంక్షేమ కార్యకర్త హెలెన్ కెల్లర్‌ను యువతరానికి తెలియజేసేలా ఈ పురస్కారాన్ని 'హెలెన్ కెల్లర్ అవార్డు'గా పేరు మార్చి అందజేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇకపై పోలీస్ స్టేషన్లలో బయోమెట్రిక్ హాజరు

ఐసిఎఫ్, ఆగస్టు 24: పోలీస్ స్టేషన్లలో ఇకపై బయోమెట్రిక్ హాజరు అమలు కానుంది. రాష్ట్రంలో వున్న 1307 పోలీస్ స్టేషన్లలో లక్షమందికి పైగా పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారి సర్వీసు రికార్డు మెయింటెనెన్స్, పదోన్నతి, జీతం, స్వచ్ఛంద పదవీ విరమణ, తొలగింపు తదితర అంశాలను ఆ శాఖ సచివాలయ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు ఉదయం 7 గంటలకే స్టేషన్‌కు వచ్చి హాజరు వెయ్యాలి. అప్పుడు వారికి 'రోల్‌కాల్' నిర్వహించి విధులు చేపట్టాల్సిన స్థలాలకు పంపిస్తారు. సచివాలయ సిబ్బంది ఉదయం 9.30 గంటలకు విధులకు వస్తారు. వీరిద్దరూ సమయానికి హాజరు కావడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, పోలీసు అధికారుల కార్యాలయాల్లో బయోమెట్రిక్ పరికరాలు అమర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అజ్ఞాత దేవాలయాల డాక్యుమెంటేషన్

ఐసిఎఫ్, ఆగస్టు 24: రాష్ట్రంలో ప్రజలకు తెలియకుండా అజ్ఞాతంలో ఉన్న ఆలయాలను గుర్తించి, వాటిలో శిల్పాలు, శాసనాలను డాక్యుమెంటేషన్ పనులు చేపట్టనున్నట్లు భారత ఆర్కియాలజీ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ రామకృష్ణన్ తెలిపారు. ఈయన నేతృత్వంలోని పురావస్తు పరిశోధన బృందం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఆలయాలను గుర్తించి డిజిటలైజేషన్ చేశారు. దీని గురించి అమర్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో 43 వేల ఆలయాలు ఉండగా, వాటిల్లో 9 వేల ఆలయాలు చరిత్రాత్మకమైనవని తెలిపారు. అందులో ప్రజలకు తెలియని ఆలయాలు కూడా కొన్ని ఉన్నాయన్నారు. వాటిని గుర్తించి డిజిటలైజేషన్ చేయనున్నట్లు వివరించారు.

హార్బరులో రూ.60 కోట్లతో గోదాములు

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: మద్రాసు హార్బరులో రూ.60 కోట్లతో కొత్తగా గోదాములను నిర్మించనున్నట్టు పోర్టు చైర్మన్ సునీల్ పాలీవాల్ తెలిపారు. దేశంలో 12 పెద్ద పోర్టుల్లో మూడో పెద్ద పోర్టుగా మద్రాస్ పోర్ట్ ట్రస్టు ఉందని, ఇక్కడ ఒకే సమయంలో 24 నౌకలు లంగరు వేసే సౌకర్యాలు ఉన్నాయన్నారు. పోర్టులో ఖాళీగా ఉన్న 1800చదరపు మీటర్ల స్థలాన్ని 4 భాగాలుగా విభజించి రూ.60 కోట్లతో గోదాములను నిర్మిస్తామని తెలిపారు.

ఆటో కొనుగోలుకు రూ.లక్ష రాయితీ

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: స్వీయ వృత్తిని ప్రోత్సహించేలా వెయ్యి మంది మహిళలు, హిజ్రాలు సొంతంగా ఆటోలు కొనుగోలు చేసేందుకు కార్మిక సంక్షేమ శాఖ రూ.లక్ష రాయితీ అందజేయనుంది. దీనికి సంబంధించి వచ్చే వారం ప్రభుత్వం జీవోను జారీ చేయనుంది. రాష్ట్ర అసంఘటిత డ్రైవర్లు, ఆటోమేటిక్ మోటర్ వెహికల్ రిపేర్ వర్కర్ల సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకున్న ఆటో డ్రైవర్ల అయిన హిజ్రాలు, మహిళలకు సొంతంగా ఆటోలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రాయితీ అందజేస్తుంది. 2023-24 సంవత్సరంలో 500 మందికి రాయితీ అందజేయగా, ఈ యేడాది 1000 మందికి అందజేయనున్నారు.

జనరిక్ షాపుల ద్వారా రూ.5,700 కోట్లకు మందుల విక్రయం

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: రాష్ట్రంలో ఉన్న ప్రజా ఫార్మసీల ద్వారా గత పది నెలలు రూ.5,700 కోట్లకు మందులు విక్రయమయ్యాయి. పేద, మధ్యతరగతి ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ ఫార్మసీలను నడుపుతోంది. వీటిలో జనరిక్ మెడిసిన్‌లను చౌక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ షాపుల్లో 80 శాతం రాయితీ ధరకు అన్ని రకాల మందులు విక్రయానికి అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలో ఉన్న 13,113 షాపుల్లో 2014 నుంచి ఇప్పటివరకు రూ.5,700 కోట్లకు మందులు విక్రయమైనట్టు అధికరులు తెలిపారు.

12 మంది ఇన్‌స్పెక్టర్లకు మళ్లీ పోస్టింగులు

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: నగరంలో వేకంట్ రిజర్వు (వీఆర్)లో ఉన్న 12 మంది పోలీస్ ఇన్‌స్పెక్టర్లకు మళ్లీ పోస్టింగులు ఇచ్చారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ అరుణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్వాల్ చావడి శాంతి భద్రతల విభాగానికి విజయ్ కుమార్, అన్నానగర్‌కు శరవణన్, వాషర్‌మెన్‌పేటకు రాజారాం, వ్యాసర్పాడికి షణ్ముగ సుందరం, తిరవొట్రియూరుకు రజినేశన్, కొళత్తూరుకు వివేకానందన్, విరుగంబాక్కంకు మణిమాల, విల్లివాక్కంకు తమిళ్‌సెల్వి, తిరువొట్రియూరు మహిళా పోలీస్ స్టేషన్‌కు మంజు వరలక్ష్మి, పుళల్‌కు మజితను ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు.

ప్రైవేటు మీటర్ల కొనుగోలుకు ఈబీ అనుమతి

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: ప్రైవేటు సంస్థలు తయారు చేసిన విద్యుత్ మీటర్లు కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు రాష్ట్ర విద్యుత్ బోర్డు అనుమతి ఇచ్చింది. కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే సమయంలో మీటర్లను విద్యుత్ బోర్డే అమరుస్తుంది. దీనికోసం దరఖాస్తుదారుల వద్ద తగిన సొమ్మును వసూలు చేస్తుంది. మీటర్ల కొనుగోలులో జాప్యం, ఇతర కారణాల వల్ల సకాలంలో వినియోగదారులకు మీటర్లను విద్యుత్ బోర్డు అందజేయలేకపోతుంది. దీంతో గృహాలు, కర్మాగారాల్లో అమర్చే విద్యుత్ మీటర్లను కొనుగోలు చేయవచ్చని సూచించింది.

వైద్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: చెన్నై నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగంలో 150 వైద్య పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. నేషనల్ అర్బన్ శానిటేషన్ మూవ్‌మెంట్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన 30 మెడికల్ ఆఫీసర్, 32 నర్సు, 66 హెల్త్ అసిస్టెంట్, 5 సైకాలజిస్టులు, 5 కమ్యూనిటీ వర్కర్, 12 మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కలిపి మొత్తం 150 పోస్టులకు అభ్యర్థుల ఎంపిక త్వరలో చేపట్టనుంది. ఔత్సాహిక అభ్యర్థులు "http://chennaico-poration.gov.in/gcc/" అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని సెప్టెంబరు ఆరో తేదీలోపు కార్పొరేషన్ రిప్పన్ బిల్డింగ్‌కు పంపించాల్సి ఉంటుంది.

ఐటీఐలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: స్థానిక గిండీలో ఉన్న ఐటీఐలో చేరేందుకు విద్యార్థులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఐటీఐలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలు జరుగుతున్నాయి. టెన్త్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐటీఐ కోర్సుల్లో చేరి విద్యాభ్యాసం చేస్తూనే పార్ట్‌టైం ఉద్యోగాలు కూడా చేసుకోవచ్చు. ఉచిత హాస్టల్ సౌకర్యం ఉంది. బస్ పాస్‌లు, యూనిఫాం వంటి ఉచిత ఉపకరణాలు అందజేస్తారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాల కోసం నెం.04422501250లో సంప్రదించవచ్చు.

ఆధ్యాత్మికం లేకుండా రాజకీయం లేదు

● మాజీ గవర్నర్ తమిళిసై



అడయార్, ఆగస్టు 24: తమిళనాట ఆధ్యాత్మికం గురించి మాట్లాడకుండా ఏ ఒక్కరూ రాజకీయాల్లో మనుగడ సాగించలేరని బీజేపీ సీనియర్ నేత, మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. ఆమె శనివారం కోవై విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, శనివారం నుంచి పళనిలో ప్రారంభమైన మురుగన్ మహానాడుకు తన అభినందనలు తెలిపారు. ఇది ఆధ్యాత్మిక భూమి అని, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడినా ఆధ్యాత్మికం గురించి మాట్లాడకుండా రాజకీయాలు చేయలేమనే విషయాన్ని ముత్తమిళ్ మురుగన్ మహానాడు రుజువు చేస్తుందన్నారు. ఇలాంటి మహానాడును తమిళనాడులో రాష్ట్రప్రభుత్వం నిర్వహించడం చూస్తుంటే ఆధ్యాత్మికం వైపు ఉన్నట్టు నిరూపిస్తుందన్నారు. ఆధ్యాత్మికం లేకుండా రాజకీయాలు లేవు. రాజకీయం లేకుండా ఆధ్యాత్మికం లేదు అని గాంధీజీ చెప్పినట్టుగా, పెరియార్ సిద్ధాంతాలను, అన్నాదురై తమిళంను అనుసరించే వీరంగా అండాళ్ తమిళంను అనుసరించే రోజులు వస్తాయన్నారు. అయితే, ఈ మహానాడుకు సీఎం స్టాలిన్ స్వయంగా వెళ్లి ప్రారంభించకుండా చెన్నై నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించడం సబబు కాదని ఆమె అభిప్రాయపడ్డారు. నటుడు విజయ్ ఆవిష్కరించిన పార్టీ జెండాలో ఉన్నది వాగై పుష్పమా లేక తూంగు మూంజి మరమా (నిద్రగన్నేరు పువ్వా) అనేది స్పష్టం కాలేదన్నారు. మరోవైపు, జెండాలో ఉన్న ఏనుగులు బీఎస్పీకి సొంతమైన ఎన్నికల గుర్తు అని, ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందన్నారు. ఇలాంటి విషయాల్లో తమలాంటి రాజకీయ నేతలు తెలియజేసే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ముందుకుసాగాలని ఆమె సూచించారు.

విజయ్ అనేక సవాళ్లను అధిగమించాలి

● డీఎండీకే చీఫ్ ప్రేమలత విజయకాంత్

ప్యారీస్, ఆగస్టు 24: కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించిన సినీ నటుడు విజయ్ ముస్ముందు అనేక రాజకీయ సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ అభిప్రాయపడ్డారు. ఆమె శనివారం స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు, ఆమె భర్త దివంగత కెప్టెన్ విజయకాంత్ 72వ జయంతిని పురస్కరించుకుని 72 మంది కార్యకర్తల చేతికి విజయకాంత్ టాటూలను వేయించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, తమిళ సినీ రంగం, రాజకీయాల్లో చక్రం తిప్పిన తమ పార్టీ వ్యవస్థాపకుడు విజయకాంత్ జన్మదినాన్ని (ఆగస్టు 25వ తేదీ) పేదరికం నిర్మూలన దినోత్సవంగా జరుపుకోనున్నట్టు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువున్న వారికి పార్టీ తరపున సంక్షేమ సహాయాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేస్తామన్నారు. నటుడు విజయ్ రాజకీయాల్లోకి రావడం మంచిదేనని, అయితే, ఆయన ముందు అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. వీటిని విజయవంతంగా ఎదుర్కొని ముందుకు ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. ఆయన సినీ రంగంలో అతిపెద్ద సవాళ్లను అధిగమించారన్నారు. అయితే, రాజకీయాలను సినిమాలుగా భావించకుండా, ఒక్కో అడుగు జాగ్రత్తగా వేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. దేవుడు లేరని వాదిస్తున్న అధికార డీఎంకే నేతలు ఇపుడు ఆధ్యాత్మికంపై దృష్టి సారించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎట్టకేలకు దేవుడున్నాడని నమ్మకంతోనే రాష్ట్ర ప్రభుత్వం తరపున దిండిగల్ జిల్లా పళనిలో మురుగన్ మహానాడును నిర్వహిస్తున్నారన్నారు. సమయానికి తగినట్టుగా రాజకీయాలను నడపడాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.



డీఎండీకే వ్యవస్థాపకుడు కెప్టెన్ విజయకాంత్ జయంతి సందర్భంగా చేతిపై ఆయన టాటూలను వేసుకున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత, మరో మహిళా నేత

రూ.227.33 కోట్లతో తూత్తుకుడి విమానాశ్రయ విస్తరణ

● ఎంపీ కనిమొళి ప్రకటన

ప్యారీస్, ఆగస్టు 24: తూత్తుక్కుడి విమానాశ్రయాన్ని రూ.227.33 కోట్లతో విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎంపీ కనిమొళి తెలిపారు. ఈ నిర్మాణ పనులను ఆమె శనివారం విమానాశ్రయ అధికారులతో కలిసి పరిశీలించారు. తూత్తుక్కుడి ఎయిర్‌పోర్టు నుంచి చెన్నైకు 5, బెంగళూరుకు 2 విమాన సేవలు నడుస్తున్నాయన్నారు. ఇక్కడ నుంచి అదనపు విమాన సర్వీసులు నడిపేందుకు వీలుగా ఎయిర్‌పోర్టులో కొత్త టెర్మినల్, రన్‌వే నిర్మాణ పనులు 17,341 చదరపు మీటర్ల విస్తీర్ణంలో చేపట్టినట్టు తెలిపారు. విమానాల రాకపోకల పర్యవేక్షణ, కంట్రోల్ రూం, కంట్రోల్ టవర్ సహా అన్ని రకాల కార్యాలయ భవనాలు, ముఖ్యంగా అగ్నిమాపక శాఖ భవనాలు, భద్రతా సిబ్బంది విశ్రాంతి గదుల నిర్మాణం జోరుగా సాగుతోందన్నారు. తూత్తుక్కుడి - తిరునెల్వేలి జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టుకు సులభంగా చేరుకునేందుకు లింకు రోడ్డు నిర్మాణం చేపడుతామన్నారు. ఒకే సమయంలో ఐదు విమానాలు ల్యాండింగ్ అయ్యేలా సౌకర్యాలు, 500 వాహనాలు పార్కింగ్, రెండు వీఐపీ లాంజ్‌లు, ఆటోమేటిక్ లిఫ్ట్ తదితరు ఆధునిక వసతుల పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. ఈ విస్తరణ పనులు పూర్తయితే, ప్రపంచంలోనే అతి పెద్ద ఏ2321 ఎయిర్ బస్ విమానాలు కూడా ఇక్కడ దిగేందుకు వీలుంటుందన్నారు. దాదాపు 95 శాతం మేరకు పూర్తయిన పనులను కనిమొళి, తూత్తుక్కుడి మేయర్ జగన్ పెరియస్వామితోపాటు ఎయిర్‌పోర్టు అధికారులు పరిశీలించారు.



తూత్తుక్కుడి ఎయిర్‌పోర్టులో అధికారులతో కలిసి విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎంపీ కనిమొళి

ఆ ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులేరీ?

● ఒక్కో కాలేజీలో ఒక్కరు కూడా లేని వైనం

ఐసిఎఫ్, ఆగస్టు 24: ఇంజనీరింగ్ అడ్మిషన్ కోసం జరిగిన రెండు విడతల కౌన్సెలింగ్‌లో 30 కళాశాలల్లో ఒక్కరంటే ఒక్క విద్యార్థి కూడా చేరలేదని సమాచారం. అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 433 ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రభుత్వ కోటాలో 1,79,938 సీట్లున్నాయి. ఈ ఏడాది విద్యార్థుల అడ్మిషన్‌కు సంబంధించిన కౌన్సెలింగ్ రెండు విడతల్లో జరిగింది. ఇప్పటి వరకూ 71,946 సీట్లు భర్తీ అయ్యాయి. ఇవి మొత్తం సీట్లలో 39 శాతం మాత్రమే. అదే సమయంలో 30 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు.

మహావీర్ దయానికేతన్ స్కూలులో కృష్ణాష్టమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

వేలూరు, ఆగస్టు 24 : కాట్పాడిలోని గాంధీనగర్ మహావీర్ దయానికేతన్ పాఠశాలలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు పాఠశాల కార్యదర్శి రాజేష్ కుమార్ జైన్ అధ్యక్షతన వైభవంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ స్వాగతో పన్యాసం చేశారు. ఈ వేడుకలల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

రూ.50లక్షలతో అభివృద్ధి పనులు



సమావేశంలో ప్రసంగిస్తున్న బాబు

వేలూరు, ఆగస్టు 24 : వేలూరు జిల్లా పంచాయతీలో రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాలని శనివారం ఉదయం జరిగిన ఆ జిల్లా పంచాయతీ సభ్యుల సమావేశం తీర్మానించింది. ఈ సమావేశానికి జిల్లా పంచా యతీ అధ్యక్షుడు బాబు అధ్యక్షత వహించారు. ఉపాధ్యక్షులు కృష్ణవేణి, కౌన్సిలర్ శివరామన్, బాబు, వెంకటసుబ్బు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ స్కూలులో కృష్ణ జయంతి



శ్రీకృష్ణుడి వేషధారణలో విద్యార్థులు

వేలూరు, ఆగస్టు 24 : వేలూరులో టీటీడీ ఆధ్వర్యంలోని వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో కృష్ణ జయంతి వేడుకలు శనివారం ఉదయం జరిగాయి. పాఠశాల హెచ్‌ఎం నెపోలియన్ అధ్యక్షత వహించారు. మాజీ ఉపాధ్యాయురాలు కల్యాణి సహకారంతో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

టీఎన్‌పీఎస్సీ పరీక్షా ఫలితాల వెల్లడి

ఐ.సి.ఎఫ్, ఆగస్టు 24: తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ గతంలో నిర్వహించిన గ్రూపు-1బి పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. టూరిజం ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం గత యేడాది జూన్‌లో రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారిలో 9 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. హిందూ దేవాదాయ శాఖలో గ్రూపు-1బిలో సహాయక కమిషనర్ పోస్టులకు జూలైలో పరీక్షలు నిర్వహించగా, ఇంటర్వ్యూలకు 219 మంది ఎంపికయ్యారు. వారి జాబితాను టీఎన్‌పీఎస్సీ అధికారికంగా విడుదల చేసింది.

ఫుట్‌బోర్డు మృతికి నష్టపరిహారం చెల్లించలేం

● ట్రిబ్యునల్ తీర్పు

ప్యారీస్, ఆగస్టు 24: బస్సు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తూ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబానికి నష్టపరిహారం అందజేయలేమని మోటర్ వాహనాల ప్రమాద కేసుల పరిష్కార ట్రిబ్యునల్ తేల్చి చెప్పింది. నగరానికి చెందిన పరశురామన్ కుమారుడు మోహన్ (17) పాఠశాలకు వెళ్లి ఇంటికి తిరిగివస్తూ తన స్నేహితులతో కలిసి ఎంటీసీ బస్సులో ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణం చేశారు. ఆ సమయంలో జరిగిన ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడగా, స్టాన్లీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన 2019 అక్టోబరు 16న జరిగింది. మృతుడి తండ్రి తన కుమారుడి మృతికి రవాణా శాఖ కారణమని పేర్కొంటూ నష్టపరిహారం కోరుతూ మోటర్ వాహనాల ప్రమాద కేసుల పరిష్కార ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీనిపై పలు దఫాలుగా విచారణ జరిపిన న్యాయమూర్తి జియావుల్ రెహ్మాన్ విద్యార్థి అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంటూ, ఈ కేసులో నష్టపరిహారం చెల్లించేలా ఆదేశాలివ్వలేమని స్పష్టం చేస్తూ తీర్పునిచ్చారు.

స్కూళ్ల అడ్వైజరీ కమిటీ సభ్యులకు ప్రశంసాపత్రాలు



కలెక్టర్ సుబ్బులక్ష్మి నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న సభ్యులు

వేలూరు, ఆగస్టు 24: వేలూరు జిల్లాలో పాఠశాలల సలహాకమిటీ సభ్యులుగా ఎంపికైన 25 మందిని కలెక్టర్ సుబ్బులక్ష్మి సత్కరించారు. స్థానిక ఈవేరా నాగమ్మాళ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన సభలో కొత్త సభ్యులకు గుర్తింపు కార్డులు, ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాజీ, వేలూరు తహసీల్దార్ మురళీధరన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

సెంజి కోటను సందర్శించనున్న యునెస్కో బృందం

ప్యారీస్, ఆగస్టు 24: తిరువణ్ణామలై జిల్లాలో సందర్శకులను ఆకట్టుకుంటున్న సెంజి కోటను యునెస్కో బృందం త్వరలో సందర్శిస్తుందని రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. దేశంలో మరాఠా రాజులు పరిపాలించిన సెంజి కోట సహా 12 పురాతన కట్టడాలను ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వం గత యేడాది యునెస్కోను కోరుతూ అధికారికంగా లేఖ రాసింది. దీంతో యునెస్కో నిపుణుల కమిటీ దేశంలోని వివిధ ప్రాంతాల్లో పురాతన కట్టడాలను సందర్శించనుంది. అంతకుముందే భారత పురావస్తు శాఖ తరపున సెంజి సహా 12 కోటల్లో నిర్వహించాల్సిన పనులను పరిశీలించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం పది మంది ఐఏఎస్ అధికారుల కమిటీని నియమించింది. ఈ కమిటీలో సభ్యుడిగా ఉన్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మీడియాతో మాట్లాడుతూ, సెంజి కోటను సందర్శించేందుకు యునెస్కో బృందం త్వరలోనే రాష్ట్రానికి రానుందని తెలిపారు. ఇందుకోసం రెవెన్యూ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు.

తిరుమావళవన్‌కు పోలీసు భద్రత పెంపు



తిరుమావళవన్

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): డీపీఐ అధినేత, ఆ పార్టీ ఎంపీ తొల్ తిరుమావళవన్‌కు రాష్ట్రప్రభుత్వం పోలీసు భద్రతను పెంచింది. ఇప్పటివరకూ ఆయనకు ప్రత్యేక భద్రతాధికా రితో భద్రత కల్పిస్తూ వచ్చిన ప్రభుత్వం ఉన్నట్టుండి మరో ప్రత్యేక భద్రతాధికారి, కానిస్టేబుల్‌ను నియమించింది. ఈ విషయమై డీపీఐ నేతలు మాట్లాడుతూ... తిరుమాకు భద్రత పెంచమని ఎలాంటి విజ్ఞప్తులు చేయనప్పటికీ ప్రభుత్వం భద్రతను పెంచిందని తెలిపారు. ఇటీవల బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య తర్వాత తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం నాయకుడు జాన్ పాండ్యన్ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు చెందిన నాయకులకు పోలీసు భద్రతను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకే తిరుమావళవన్‌కు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను పెంచినట్లు తెలుస్తోంది.

సీమాన్‌పై పరువు నష్టం దావా : తిరుచ్చి ఎస్పీ వెల్లడి

ప్యారీస్, ఆగస్టు 24: నామ్ తమిళర్ పార్టీ కన్వీనర్, సినీ దర్శకుడు సీమాన్‌పై పరువునష్టం దావా వేయనున్నట్టు తిరుచ్చి ఎస్పీ వరుణ్‌కుమార్ పేర్కొన్నారు. తాను గత యేడాదిగా తిరుచ్చి ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నానని, తన 13 యేళ్ల ఐపీఎస్ జీవితంలో ప్రజలకు మేలు చేసే విధంగా విధులు నిర్వహించి, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నట్టు తెలిపారు. అయితే, తన ఎదుగుదలను చూసి ఓర్వలేక సీమాన్ సోషల్ మీడియా వేదికగా తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా కామెంట్స్ చేశారని, అందుకే ఆయనపై పరువు నష్టం దావా వేయనున్నట్టు తెలిపారు.

చెన్నైలో ఇండియా కామన్వెల్త్ బిజినెస్ ఫోరం



సావనీర్ ఆవిష్కరణలో ఇండియా కామన్వెల్త్ బిజినెస్ ఫోరం సభ్యులు

అడయార్, ఆగస్టు 24: చెన్నైలో ఇండియా కామన్వెల్త్ బిజినెస్ ఫోరం ప్రతినిధుల బృందం పర్యటించింది. భారత్, సీషెల్స్ ప్రాంతాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై భేటీ అయ్యారు. ఫోరం సమావేశం ఇండియా కామన్వెల్త్ ట్రేడ్ కౌన్సిల్ హానరీ ట్రేడ్ కమిషనర్ కరుణానిధి వైద్యనాథస్వామి స్వాగతంతో ప్రారంభమైంది. 'ఇండియా - సీషెల్స్ రిలేషన్స్ - వే ఫార్వర్డ్' అనే థీంతో జరిగిన సమావేశంలో భారత్‌లో సిషెల్స్ హై కమిషనర్ లలాటియానా అకౌచె కీలక ప్రసంగం చేయగా, ఇరు దేశాలకు చెందిన అనేక మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వదేశీ కృత్రిమ హృదయ కవాటాలు పటిష్ఠమైనవే

● డాక్టర్ అశోక్ సేథ్ ప్రకటన



అశోక్‌సేథ్‌కు జీవనసాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న శ్రీరామచంద్రా వైద్య విశ్వవిద్యాలయం ప్రో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకముడి

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో భారతదేశంలో తయారవుతున్న కృత్రిమ హృదయ కవాటాలు చాలా పటిష్ఠంగా ఉండడమే కాకుండా సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఫోర్టిస్ హెల్త్‌కేర్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ అశోక్ సేథ్ అన్నారు. పోరూరులోని శ్రీరామచంద్రా వైద్యవిశ్వవిద్యాలయంలో శనివారం ఏర్పాటైన సభలో 'హృద్రోగ చికిత్సలలో భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో చోటుచేసుకున్న మార్పులు' అనే అంశంపై ఆయన డాక్టర్ ఎస్.తనికాచలం ఎండోమెంట్ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ మహేష్ వాకముడి జీవనసాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి 400 మంది వైద్యనిపుణులు హాజరయ్యారు. శ్రీరామచంద్రా విశ్వవిద్యాలయం కార్డియాక్ కేర్ సెంటర్ చైర్మన్ డాక్టర్ ఎస్.తనికాచలం, ప్రొఫెసర్లు డాక్టర్ జేఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఎస్. నాగేంద్ర భూపతి, డాక్టర్ ఎస్.రమేష్, డాక్టర్ బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎస్‌కు బాంబు బెదిరింపు

● యువకుడి అరెస్టు



వెల్లదురై

చెన్నై, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు పులిదేవన్ జయంతికి తెన్‌కాశి జిల్లా శివగిరి సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించేందుకు హాజరు కానున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిపై బాంబు విసరనున్నట్లు ఫోన్‌లో బెదిరించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలోని పోలీసు కంట్రోల్ రూంకు మూడు రోజులకు ముందు ఓ యువకుడు ఫోన్ చేసి ఈ సంగతి తెలిపాడు. ఆ కంట్రోల్ రూంలో నమోదైన అతడి సెల్‌ఫోన్ ఆధారంగా బాంబు బెదిరింపు చేసిన యువకుడు తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ సమీపం తలైవన్‌కోటకి చెందిన వెల్లదురై (32)గా గుర్తించారు. వెంటనే చెన్నై పోలీసులు ఆ సమాచారాన్ని తెన్‌కాశి జిల్లా పోలీసులకు తెలపడంతో ప్రత్యేక దళం పోలీసులు హుటాహుటిన వెళ్లి అతడిని అరెస్టు చేశారు. పుళియంగుడి పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో విచారించలేదు

● సినీ దర్శకుడు నెల్సన్



అడయార్, ఆగస్టు 24: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో సినీ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్‌ను ప్రత్యేక బృందం పోలీసులు విచారణ జరిపినట్టుగా మీడియాలో కథనాలు వచ్చాయి. వీటిపై 'జైలర్' దర్శకుడు నెల్సన్ స్పందించారు. ఆ మీడియా కథనాల్లో లేశ మాత్రం కూడా నిజం లేదని స్పష్టం చేశారు. ప్రత్యేక బృందం పోలీసులు తన నివాసానికి వచ్చి తనను విచారించినట్టు వచ్చిన వార్తల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన శనివారం స్పష్టం చేశారు. అయితే, ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాధవరానికి చెందిన న్యాయవాది మొట్టై కృష్ణన్‌తో మొబైల్ ఫోనులో మాట్లాడిన వ్యవహారంలో నెల్సన్ దిలీప్ కుమార్ భార్య మోనీషాను విచారించారు. మొట్టై కృష్ణన్ తనకు స్నేహితుడని, దీంతో ఆయనతో మాట్లాడినట్టు ఆమె పోలీసులకు చెప్పారు. కాగా, ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు విచారణలో నెల్సన్ దిలీప్ కుమార్ దంపతుల పేర్లు తెరపైకి రావడం ఇపుడు కోలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ఆరేళ్ల కుమార్తెపై అత్యాచారం

● పుదుచ్చేరి పురట్చి భారతం నేత అరెస్టు

అడయార్, ఆగస్టు 24: ఆరేళ్ల కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన కేసులో పుదుచ్చేరి రాష్ట్ర పురట్చి భారతం అధ్యక్షుడు పురుషోత్తమన్‌ను స్థానిక పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేశారు. స్థానిక పెరంబూరు బ్యారెక్స్ రోడ్డుకు చెందిన పురుషోత్తమన్ పుదుచ్చేరి పురట్చిభారతం పార్టీ అధ్యక్షుడు. ఈయన ఫర్నీషింగ్ ఆయిల్ వ్యాపారం చేస్తున్నారు. ఆయన పుదుచ్చేరికి చెందిన మహిళను వివాహం చేసుకోగా, వీరికి ఆరేళ్ల కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా మూడేళ్లుగా ఆయన భార్యకు దూరంగా ఉంటు న్నారు. అయన పుదుచ్చేరికి వెళ్లకుండా, పులియంతోపులో ఉన్న రెండో భార్యతో నివసిస్తున్నారు. రెండో భార్యకు 18, 14, 6 యేళ్ల కుమార్తెలున్నారు. ఈ ఆరేళ్ల కుమార్తె హఠాత్తుగా అనారోగ్యంపాలుకావడంతో మంగళవారం రాత్రి 11 గంటలకు ఎగ్మోరులోని చిన్నపిల్లల ఆస్పత్రికి రెండో భార్య తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు బాలికను పరిశీలించి తలకు బలమైన గాయాలున్నట్టు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పురుషోత్తమన్‌ను అదుపులోకి తీసుకుని దాదాపు 7 గంటల పాటు విచారణ జరిపారు. ఈ విచారణలో కుమార్తెపై అత్యాచారం జరిపిన విషయం వెలుగు చూసింది. దీంతో ఆయనను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తురా భక్తి సంగీత ఉత్సవం

అడయార్, ఆగస్టు 24: స్థానిక పెరంబూరులోని వాటర్‌బరీ మెమోరియల్ తెలుగు బాప్టిస్ట్ సంఘం ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు తురా సువార్త సంగీత ఉత్సవం జరగనుంది. తురా ఫౌండేషన్ డైరెక్టర్ రెవరెండ్ తాటిపర్తి ఐజక్, స్వర్ణలత దంపతుల అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఎం.జాన్సన్ పర్యవేక్షణలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయకుడు డాక్టర్ రాపాక జాన్ బిల్‌మోరియా, నిసి జాన్, మెర్సీ ఏంజెల్, టోనీ ప్రకాశ్, స్టాన్లీ జోన్స్, స్వరూప్ తదితరులు పాటలు పాడనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు తెలిపారు.



విరుగంబాక్కం బాలలోక్ పాఠశాలలో కృష్ణజయంతి సందర్భంగా వివిధ వేషధారణలతో సందడి చేస్తున్న బాలబాలికలు

SUNDAY SPECIAL



అగ్గిపెట్టెది దైనందిక జీవితంలో ప్రధాన పాత్ర. స్టౌ, దీపం, అగరబత్తీలు, క్యాండిళ్లు, సిగరెట్ వెలిగించాలంటే అగ్గిపెట్టె అవసరం ఎంతైనా ఉంది. విరుదునగర్ జిల్లాలో బాణసంచా తయారీ తర్వాత అంతటి వ్యాపారం కలిగింది అగ్గిపెట్టెల పరిశ్రమ. గతంలో కుటీర పరిశ్రమగా ఉన్న ఈ రంగంలో ఆధునిక యంత్రాల రాకతో కర్మాగారంగా మారింది. సాత్తూర్, శివకాశి, విరుదునగర్, శ్రీవిల్లిపుత్తూర్, అరుప్పుకోట, కారియాపట్టి, తిరుచూలి తదితర తాలూకాల్లో సుమారు 2,982 అగ్గిపెట్టె కర్మాగారాలున్నాయి. ఈ రంగంలో సుమారు 5 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 8 లక్షల మంది పరోక్షంగాను జీవనోపాధి పొందుతున్నారు. - పెరంబూర్



అగ్గిపెట్టెల తయారీలో ఆధునిక యంత్రాలు

అగ్గిపెట్టెల తయారీలో మహిళా కార్మికులు

అగ్గిపెట్టె పరిశ్రమకు రక్షణేదీ?

● 13 లక్షల మంది జీవనోపాధిపై నీలినీడలు!

కోల్‌కతాలో ప్రారంభమై...

1920లో జపాన్ నుంచి వలసవచ్చిన కుటుంబాలు కోల్‌కతాలో స్థిరపడి అగ్గిపెట్టెల తయారీ ప్రారంభించాయి. తొలుత చేతుల ద్వారా అగ్గిపెట్టెల తయారీ చేపట్టగా, తదనంతరం ఆధునిక యంత్రాలు ఈ పరిశ్రమకు జత కలిశాయి. కోల్‌కతాలో ఏర్పాటైన కర్మాగారాల్లో తయారయ్యే ముడిపదార్థాల దిగుమతులు తగ్గడంతో ఈ పరిశ్రమ దక్షిణాదికి తరలింది. ముఖ్యంగా రామనాథపురం, తిరునల్వేలి జిల్లాల్లో ఈ కర్మాగారాలు ప్రారంభమయ్యాయి. పి.అయా నాడార్, ఎ.షణ్ముగ నాడార్ కోల్‌కతా వెళ్లి అక్కడి వ్యాపారి పూర్ణచంద్ర రాయ్ వద్ద అగ్గిపెట్టెల తయారీలో మెలకువలు నేర్చుకున్నారు. అప్పట్లో అభివృద్ధి చెందిన ఈ ప్రాంతాల్లో తక్కువ వేతనంతో కార్మికులు లభించడం, సమీపంలోని కేరళ రాష్ట్రం నుంచి ముడి పదార్థాలు లభ్యం కావడంతో అనతికాలంలో ఈ పరిశ్రమ రాష్ట్రంలో అభివృద్ధి చెందింది.



పుల్లల తయారీలో కార్మికులు

పుల్లలు సిద్ధం చేస్తున్న దృశ్యం

మహిళా కార్మికులే అధికం...

ఈ పరిశ్రమలో అధికంగా మహిళా కార్మికులు పని చేస్తుంటారు. వారిలో సుమారు 60 శాతం అక్షరాస్యులు కాగా, 40 శాతం మంది నిరక్షరాస్యులని ఓ సర్వేలో తేలింది. అక్షరాస్యుల్లో కూడా 10వ తరగతి లోపు చదివినవారే అధికం. ఈ పరిశ్రమలో పనిచేస్తున్న వారిలో కేవలం 20 శాతం మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు కాగా, కొందరు కాంట్రాక్ట్ పద్ధతిలోను, మరికొందరు దినకూలీలుగా పనిచేస్తుంటారు. వీరికి అందించే వేతనం కూడా చాలా తక్కువే.

రూ.600 కోట్ల వ్యాపారం...

అగ్గిపెట్టెల పరిశ్రమలో ఏడాదికి సుమారు రూ.600 కోట్ల వ్యాపారం జరుగుతోంది. కానీ, ముడిపదార్థాల కొరత, లైసెన్స్ విధానం సహా పలు కారణాలతో ప్రస్తుతం ఈ పరిశ్రమ చిక్కుల్లో పడింది. అగ్గిపెట్టెల తయారీకి ఉపయోగించే ప్రధాన ముడి పదార్థాలైన పొటాషియం క్లోరైడ్, సల్ఫర్ తదితరాలు కొనుగోలు, వినియోగంలో నిబంధనల కారణంగా ఈ పరిశ్రమ సవాళ్లను ఎదుర్కొంటోంది. పొటాషియం క్లోరైడ్ తయారుచేసే సంస్థలకు జీవితకాల లైసెన్స్ మంజూరు చేస్తున్నారు. అలాగే, పొటాషియం క్లోరైడ్ తక్కువ మొత్తంలో కొనుగోలు చేసి వినియోగించే కర్మాగారాలకు ప్రతి ఐదేళ్లకు లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సి వస్తుంది. ఈ కర్మాగారాలకు శాశ్వత లైసెన్స్ ఇవ్వాలని కర్మాగారాల యజమానులు కోరుతున్నారు.

చైనా లైటర్లతో ముప్పు...

చైనా నుంచి దిగుమతి అవుతున్న లైటర్లతో అగ్గిపెట్టెల పరిశ్రమ ప్రశ్నార్థకంగా మారింది. చైనా లైటర్ల దిగుమతిని నిషేధించాలని కార్మికులు చేపట్టిన ఆందోళనలతో స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దేశంలో రూ.20 తక్కువగా ఉన్న లైటర్ల దిగుమతులకు నిషేధం విధించింది. కానీ, చైనా నుంచి లైటర్లు చట్టవిరుద్ధంగా నేపాల్ మీదుగా తీసుకొస్తున్నారు. ఇక, మరికొందరు లైటర్ల తయారీకి విడిగించే ముడిభాగాలను చైనా నుంచి దిగుమతి చేసుకొని, ఇక్కడే తయారుచేసి దేశీయ ఉత్పత్తి అంటూ విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారం బహిరంగా జరుగుతున్నా దాన్ని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

ప్రభుత్వాలు ఆదుకోవాలి...

తమ సమస్యలను పరిష్కరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని నేషనల్ స్మాల్ మ్యాచ్ మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.పరమశివం విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్లతో ఇటీవల సంఘ నిర్వాహకులు స్పీకర్ అప్పావు, గత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్‌మీనాకు వినతిపత్రం అందజేశారు. లక్షలాది మందికి జీవనోపాధి చూపుతున్న అగ్గిపెట్టెల పరిశ్రమ రక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిత్రజ్యోతి

డిసెంబరులో 22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్

చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లోగో



తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఇండో సినీ అప్రిసియేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 22వ చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. డిసెంబరు 12 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే ఈ చిత్రోత్సవంలో ప్రదర్శించే చిత్రాల కోసం ఎంట్రీలను నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు. ఇందులో తమిళ చిత్రాలతో పాటు వివిధ భాషలకు చెందిన ప్రాంతీయ చిత్రాలు, విదేశీ చిత్రాల విభాగంలో 10 సినిమాలతో పాటు కాన్స్, బెర్లిన్, వెనిస్ తదితర ఇంటర్నేషనల్ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైన ఉత్తమ చిత్రాలను కూడా ఇక్కడ ప్రదర్శించనున్నారు. ఈ విషయంపై ఆ చిత్రోత్సవాల కమిటీ పత్రికా ప్రకటన విడుదల చేసింది. 'చెన్నై ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు "https://chennaifilmfest.com"లో తమ ఎంట్రీలను రిజిస్టర్ చేసుకోవచ్చు. 2023 అక్టోబరు 13 నుంచి 2024 అక్టోబరు 15వ తేదీ వరకు విడుదలయ్యే చిత్రాలకు ఎలాంటి ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. ఎంట్రీలను నవంబరు 2వ తేదీలోపు సమర్పించాల్సి ఉంటుంది. పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లోనే రిజిస్టర్ చేసుకుని, ఆన్‌లైన్‌లోనే అడ్మిట్ కార్డులను పొందాల్సి ఉంటుంది' అని పేర్కొన్నారు.

టీజయ్ - జనని జంటగా కొత్త చిత్రం

● చిత్తూరులో శరవేగంగా షూటింగ్



జనని

'అసురన్' (ధనుష్), 'పత్తు తల' (శింబు) వంటి చిత్రాల్లో సహాయ నటుడిగా నటించిన టీజయ్ అరుణాచలం హీరోగా పరిచయమవుతున్నారు. వాస్తవ సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ తమిళనాడు - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన చిత్తూరు, పరిసర ప్రాంతాల్లో ఈనెల 15 నుంచి శరవేగంగా జరుపుకుంటోంది. ఇంకా టైటిల్ ఖరారుకాని ఈ సినిమాకు ప్రముఖ దర్శకుడు శింబు దేవన్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన నవీన్ డి. గోపాల్ దర్శకత్వం చేపట్టారు. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో 'బిగ్‌బాస్ ఆరో సీజన్ ఫేం', 'లియో' సినిమాలో విజయ్ చెల్లెలిగా నటించిన జనని హీరోయిన్‌గా నటిస్తోంది. వీరితో పాటు సీనియర్ నటి రాశితో పాటు ఆదిత్య, కల్కి రాజా, సూపర్‌గుడ్ సుబ్రమణి, సెంథిల్‌కుమారి, దీపా శంకర్, క్రేన్ మనోహర్, పావెల్ నవగీతన్ వంటి వారు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. మాసం సతీష్ ఛాయాగ్రహణం అందిస్తున్న ఈ సినిమాకు ఆర్ట్ సౌందర్, సంగీతం కిరణ్ జోస్. శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఆర్.వెంకటేష్, నిర్మాత మౌళి ఎం.రాధాకృష్ణన్.

'ది గోట్'కు 'యూ/ఏ' సర్టిఫికెట్

విజయ్ హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ది గోట్' (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం) సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ సినిమాకు సెన్సార్ బృందం 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను మంజూరు చేసింది. అలాగే, భారీ యాక్షన్, సైంటిఫిక్ జోనర్‌లో రూపొందిన ఈ చిత్రం నిడివి కూడా సుమారుగా 2 గంటలా 30 నిమిషాలుగా ఉంది. కాగా, ఈ సినిమాలో విజయ్‌తో పాటు ప్రశాంత్, ప్రభుదేవా, లైలా, స్నేహ, మోహన్, జయరాం, వైభవ్, ప్రేమ్‌జీ, మీనాక్షి చౌదరి తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఏజీఎస్ నిర్మాణ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. వినాయకచవితి పండుగ సందర్భంగా వచ్చే నెల 5న విడుదలకానుంది. విజయ్ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమా ట్రైలర్ ఇటీవలే విడుదలై మంచి స్పందన రాగా, తొలి సింగిల్ సాంగ్‌కు మాత్రం మిశ్రమ టాక్ వచ్చిన విషయం తెల్సిందే.



→ 'ది గోట్' చిత్రంలో విజయ్

దీపావళి రేసులో హరీష్ కల్యాణ్ 'డీజల్'



'డీజల్'లో హరీష్ కల్యాణ్

షణ్ముగ ముత్తుస్వామి దర్శకత్వంలో హరీష్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'డీజల్'. అతుల్య రవి హీరోయిన్. కరుణాస్, సాయికుమార్, అనన్య, వినయ్ రాయ్, తంగదురై, రమేష్ తిలక్, దీనా, వివేక్ ప్రసన్న వంటి ముఖ్య తారాగణం నటించిన ఈ సినిమాను దీపావళికి విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నారు. డిబు నినన్ థామస్ సంగీతం అందించే ఈ మూవీని థర్డ్ ఐ ప్రొడక్షన్స్, ఎస్.పి.ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని చివరి దశ నిర్మాణ పనులు జరుపుకుంటుంది. హరీష్ కల్యాణ్ సినీ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మితమైన చిత్రం కావడంతో సరైన రిలీజ్ తేదీ కోసం చిత్ర దర్శక నిర్మాతలు ఎదురు చూస్తున్నారు. ఇందులోభాగంగా, దీపావళి పండుగ రోజైన అక్టోబరు 31న రిలీజ్ చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఇప్పటికే ఇదే రోజున శివ కార్తికేయన్ 'అమరన్', జయం రవి 'బ్రదర్' చిత్రాలు విడుదలకు చేయనున్నట్టు ప్రకటించారు.

ఉచితంగా ఫార్ములా-4 కార్ రేస్ పోటీల వీక్షణ

● మంత్రి ఉదయనిధి స్టాలిన్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉదయనిధి

ప్యారీస్, ఆగస్టు 24: స్థానిక మెరీనా బీచ్ సమీపంలోని ఐల్యాండ్ మైదానంలో ఈ నెల 31వ తేది, సెప్టెంబరు 1న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఫార్ములా-4 కార్ రేస్‌ను నగరవాసులు ఉచితంగా వీక్షించవచ్చని మంత్రి ఉదయనిధి తెలిపారు. శనివారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఫార్ములా-4 కార్ రేస్ పోటీల నిర్వహణ కోసం చేపట్టిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, పోలీస్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, అగ్నిమాపక, రహదారుల శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం మంత్రి ఉదయనిధి మీడియాతో మాట్లాడుతూ... ఈ నెల 31, సెప్టెంబరు 1న చెన్నైలో తొలిసారి నిర్వహించే ఫార్ములా-4 కార్ రేస్‌ను ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. ఈ పోటీలను సుమారు 8 వేల మందికి పైగా కూర్చొని వీక్షించేందుకు ఐల్యాండ్ మైదానంలో సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. వచ్చే శనివారం తొలి రౌండ్ పోటీని ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చన్నారు. మధ్యాహ్నం తర్వాత వివిధ రౌండ్లలో పోటీలు రాత్రి 10.30 గంటల వరకు జరుగుతాయని ఆయన వివరించారు.



శ్రీకృష్ణుడు, సత్యభామల వేషధారణలో విద్యార్థులు - విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుమ, ఉపాధ్యాయులు

గోకుల కృష్ణా... గోపాల కృష్ణా

● నారాయణ పాఠశాలలో వేడుకగా శ్రీకృష్ణ జయంతి

పెరంబూర్, ఆగస్టు 24: స్థానిక రామాపురంలోని నారాయణ పాఠశాలలో శ్రీ కృష్ణ జయంతి వేడుకలు కోలాహలంగా జరిగాయి. ప్రిన్సిపాల్ సుమ నేతృత్వంలో సాగిన ఈ వేడుకల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో సందడి చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించగా, భక్తి పాటలకు అనుగుణంగా విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. బుడిబుడి అడుగులతో చిన్నారులు చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ఇలాంటి వేడుకలు సరికొత్త ఆనందాన్ని, అనుభూతిని కలిగిస్తాయని ప్రిన్సిపాల్ సుమ తెలిపారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా వైద్య ఉచిత శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌కే జావేర్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 24: స్థానిక తండయారుపేట కెప్టెన్ మహల్‌లో ట్యాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య ఉచిత శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆర్ఎస్ జావేర్ ఐదో వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో కళ్లు, దంతాలు, ఫిజియోథెరపి, క్షయ, మహిళలు, చిన్నారుల అనారోగ్య సమస్యలతో పాటు వివిధ సమస్యలకు ఆయా విభాగాల వైద్యులు వివిధ రకాలైన పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించిన వారికి పంబల్ శంకర్ నేత్రాలయంలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి కంటి అద్దాలను పంపిణీ చేసేలా ఏర్పాట్లుచేశారు. ఈ మెగా శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది. ఇందులో సుమారు 2 వేల మంది వరకు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరం ప్రారంభోత్సవంలో ట్యాబ్లెట్స్ ఇండియా సీఈవోలు ఆర్‌కే జావేర్, భారత్ జావేర్, కంపెనీ ప్రతినిధులు ఎం రవి, కేవీ వాసుదేవ్, వి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వండలూరులో పిల్లకు జన్మనిచ్చిన నీటి ఏనుగు

ఐసిఎఫ్, ఆగస్టు 24: స్థానిక వండలూరు జులాజికల్ పార్కులో నీటి ఏనుగు ఓ పిల్లకు జన్మనిచ్చింది. ఈ పార్కుకు 2021లో స్విట్జర్లాండ్‌లోని వాంపూరి అనే ఆడ నీటి ఏనుగు, కర్ణాటక నుంచి సౌందర్య అనే ఆడ నీటి ఏనుగును దిగుమతి చేసుకున్నారు. ప్రస్తుతం పార్కులో ఐదు ఆడ, రెండు మగ నీటి ఏనుగులున్నాయి. వీటిని వేర్వేరు ప్రాంతాల్లో సంరక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఓ ఆడ నీటి ఏనుగు బుధవారం సాయంత్రం ఓ పిల్లకు జన్మనిచ్చింది. ఈ గున్న నీటి ఏనుగుకు త్వరలో ముఖ్యమంత్రి నామకరణం చేయనున్నారని పార్కు అధికారులు తెలిపారు.



తల్లితో గున్న నీటిఏనుగు ←



విజేతలతో ఊటుకూరు శరత్ కుమార్

ఎస్‌కేపీసీలో విద్యార్థినుల సందడి

ప్యారీస్, ఆగస్టు 24: స్థానిక జార్జ్‌టౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ) అనుబంధ సంస్థ కళాలయ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ విభాగాల కల్చరల్ ఫెస్ట్ శనివారం జరిగింది. కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహనశ్రీ ముగింపు వేడుకల్లో పాల్గొని గ్రూప్ సింగింగ్, ట్రెడిషనల్ వాక్, గ్రూప్ డ్యాన్స్, ఎకో ఫ్రెండ్లీ డ్రెస్, రంగోలీ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రసంశాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. శుక్ర, శనివారాల్లో ఈ ప్రత్యేక పోటీల్లో విద్యార్థినిలు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు.

డీఎంకే సర్కారుకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే ధర్నా

అడయార్, ఆగస్టు 24: రాష్ట్రంలో కళ్లర్ సంక్షేమ పాఠశాలలు, విడిది గృహాలను మూసివేసేందుకు ప్రయత్నిస్తున్న డీఎంకే ప్రభుత్వ తీరును ఖండిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో శనివారం మదురై జిల్లా చెక్కనూరులో నిరాహార దీక్ష జరిగింది. ఇందులో మాజీ మంత్రులు దిండిగల్ శ్రీనివాసన్, సెల్లూరాజు, నత్తం విశ్వనాథన్, ఆర్‌బీ ఉదయకుమార్, ఎమ్మెల్యే రాజన్ చెల్లప్పా సహా వందలాది మంది పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాగిన దీక్ష కారణంగా చెక్కనూరులో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.